

చైతన్యనగర్ గ్రామంలో ఉన్న ప్రభుత్వ ట్రైబల్ వెల్ఫేర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఇన్‌చార్జి అధికారి మల్లేశం

# గుణాత్మక విద్యను అందించాలి

- జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఇన్‌చార్జి అధికారి మల్లేశం
- చైతన్యనగర్‌లో ప్రభుత్వ ట్రైబల్ వెల్ఫేర్ ప్రాథమిక పాఠశాల, వన నర్సరీ ఆకస్మిక తనిఖీ

పెద్దేముల్, జూన్ 19 : విద్యార్థులకు పౌష్టికాహారం తోపాటు నాణ్యమైన విద్యను అందించాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఇన్‌చార్జి అధికారి మల్లేశం అన్నారు. బుధవారం మండల పరిధిలోని చైతన్యనగర్ గ్రామంలో ఉన్న ప్రభుత్వ ట్రైబల్ వెల్ఫేర్ ప్రాథమిక పాఠశాలను, అంగన్‌వాడీ కేంద్రాన్ని, వన నర్సరీని సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ.. పాఠశాలను పరిశీలిస్తూ పాఠశాలల్లో ఎంతమంది విద్యార్థులు ఉన్నారు? వీరికి ఏక రూప దుస్తులు, పుస్తకాలు ఇచ్చారా? ప్రతి రోజూ మధ్యాహ్నం రుచికరమైన ఆహారాన్ని అందిస్తున్నారా? విద్యను బోధిస్తున్నారా? అనే అంశాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకొన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి విద్యార్థులకు వెలుతురులో భోజనం పెట్టాలని టీచర్‌ను ఆదేశించారు. తదుపరి గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న వన నర్సరీని పరిశీలించి వన నర్సరీ నిర్వహణ బాగుందన్నారు. పెంచుతున్న మొక్కలను ఎక్కడెక్కడ నాటుతారు? ఎన్ని రకాల మొక్కలను పెంచుతున్నారు? మొక్కల పెంపకానికి ఏమేమి జాగ్రత్తలు తీసుకుంటున్నారు? అనే అంశాలను ఎంపీవో రమేశ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి నరేశ్‌లను అడిగి తెలుసుకొన్నారు. పెంచిన మొక్కలను ప్రజలకు అనుకూలంగా ఉన్న చోట, ప్రత్యేక ప్రాంతాలు, స్థలాల్లో నాటి నీరు పోసి సంరక్షణ చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. తనిఖీల్లో ఐటీడీఏ సిబ్బంది వినోద్, హరికృష్ణ పాల్గొన్నారు.

# అనుమతులు లేని ఎరువులు సీజ్



ఎరువుల దుకాణదారుడికి నోటీసు జారీ చేస్తున్న ఏవో లావణ్య

కొడంగల్, జూన్ 19 : వ్యవసాయ శాఖ అనుమతులు లేని ఎరువుల నిల్వను వ్యవసాయాధికారి లావణ్య గుర్తించి సీజ్ చేసి నోటీసులు జారీ చేశారు. బుధవారం కొడంగల్‌లోని వైష్ణవి ఎరువుల దుకాణంలో సోదాలు నిర్వహించారు. దుకాణంలో వ్యవసాయశాఖ అనుమతులు లేని డీఏపీ 69 మెట్రిక్ టన్నులు, యూరియా 88 మెట్రిక్ టన్నులు, ఎస్ ఎస్‌పీ 13 మెట్రిక్ టన్నులు నిల్వ ఉండటాన్ని గుర్తించినట్లు లావణ్య పేర్కొన్నారు. ఎరువుల విలువ దాదాపు రూ.28లక్షలకు పైగా ఉంటుందన్నారు. 21 రోజుల్లోగా ఎరువులకు సంబంధించి అనుమతులు తీసుకోవాలని ఆదేశించారు. అనుమతులు లేని ఎరువుల అమ్మకాలు చేపడితే చట్టపరంగా చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఎరువులు, విత్తనాలకు సంబంధించి పూర్తి స్థాయి అనుమతి పత్రాలు కలిగి ఉండాలని, లేదంటే కఠిన చర్యలకు బాధ్యత వహించాల్సి వస్తుందని ఆమె తెలిపారు.



మర్పల్లిలో తహసీల్దార్ గణేశ్‌కు వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ విజయ్ కుమార్

## ఉద్యోగస్తులకు వైద్య పరీక్షలు

మర్పల్లి, జూన్ 19 : వర్షాకాలం సందర్భంగా ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ విజయ్ కుమార్ అన్నారు. బుధవారం మర్పల్లిలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రాజమల్లయ్య, తహసీల్దార్ గణేశ్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, ఉద్యోగస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ఇంటి ఎదుట నీరు నిల్వ ఉండకుండా చూడాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. గురువారం జాతీయ నులిపురుగుల నివారణ దినం సందర్భంగా ప్రతి పాఠశాలలో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను అందజేస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఈవో తిరుపతయ్య, హెచ్‌ఎస్ అమరేశ్వరి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

## ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

**ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్**

బండ్లగూడ, జూన్ 19 : ప్రభుత్వ పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ పేర్కొన్నారు. బుధవారం రాజేంద్రనగర్ తహసీల్దార్ కార్యాలయంలో అర్హులకు ఆయన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను 913 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ బొమ్మ రాములు, నాయబ్ తహసీల్దార్ క్రాంతికుమార్, పలువురు కార్పొరేటర్లు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# రికార్డు స్థాయిలో వేలం



బహిరంగ వేలంలో పాల్గొన్న ఏజెన్సీ వ్యాపారులు

తాండూరు, జూన్ 19 : తాండూరు పట్టణం మరోసారి రాష్ట్రంలోనే రికార్డు సృష్టించింది. లక్ష కన్నా తక్కువ జనాభా ఉన్న పట్టణాల్లో మాంస వ్యర్థాల సేకరణలో రికార్డులను బద్దలు కొట్టి ఏకంగా వేలంలో రూ.30లక్షల65వేల మార్కును తాకింది. దీంతో తాండూరు పురపాలక సంఘానికి భారీగా ఆదాయం సమకూరనున్నది. బుధవారం తాండూరు పురపాలక సంఘ కార్యాలయంలో కమిషనర్ విక్రమసింహారెడ్డి ఆధ్వర్యంలో తాండూరులో చికెన్, మటన్, చేప మాంస వ్యర్థాలను తరలించేందుకు సేకరణ ఏజెన్సీలకు బహిరంగ వేలం నిర్వహించారు. తాండూరుతో పాటు కొడంగల్, పరిగి, గద్వాల ప్రాంతాలకు చెందిన వ్యాపారులు వేలంలో పాల్గొన్నారు. కొడంగల్‌కు చెందిన రఫీ అనే వ్యాపారి అత్యధికంగా రూ.30లక్షల65వేలకు వేలం పాడి దక్కించుకున్నారు.

## శిలాఫలకం ధ్వంసం

పరిగి, జూన్ 19 : పరిగి మండలంలోని కాళ్లాపూర్ గ్రామంలో కొన్ని నెలల క్రితం బీటీ రోడ్డు ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన శిలాఫలకాన్ని మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. కాళ్లాపూర్ నుంచి లొంక ఆంజనేయ స్వామి దేవాలయం వరకు నూతనంగా నిర్మాణం చేపట్టిన బీటీ రోడ్డు ప్రారంభోత్సవం సందర్భంగా ఈ శిలాఫలకం ఏర్పాటు చేశారు. ఈ రోడ్డును అప్పటి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి ప్రారంభించారు. మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు శిలాఫలకాన్ని ధ్వంసం చేయడంతో బీఆర్‌ఎస్ నాయకులు పరిగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. శిలాఫలకం ధ్వంసం చేసే సంస్కృతి సరైంది కాదని బీఆర్‌ఎస్ నాయకులు పేర్కొన్నారు. శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు.



## మత్స్య సహకార సంఘం నూతన కార్యవర్గం

బొంరాస్‌పేట, జూన్ 19 : దుద్యాల మత్స్య సహకార సంఘం అధ్యక్షుడిగా లాల్ కోట బుగ్గప్పను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం గ్రామంలో మత్స్యకారులు ఎన్నికల అధికారి సరస్వతి సమక్షంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా జి.బుగ్గప్ప, కార్యదర్శిగా అనంతయ్య, సభ్యులుగా నర్సింహులు, రాములు, వెంకటయ్య, సాయిలు, బోయిని సాయిలు, మల్లేశ్‌లను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గం ఐదేండ్లపాటు కొనసాగుతుంది. కార్యక్రమంలో సంఘం మాజీ అధ్యక్షుడు వెంకటయ్య పాల్గొన్నారు.



నూతన కార్యవర్గానికి ధ్రువీకరణపత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారి సరస్వతి



పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా కొందుర్గు, పరిగి మండలాల సరిహద్దుల్లోని లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలని కోరుతూ పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్ బుధవారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు వినతిపత్రం అందజేశారు. - పరిగి, జూన్ 19



వికారాబాద్ జిల్లా నూతన కలెక్టర్ ప్రతీక్‌జైన్‌ను బుధవారం కలెక్టరేట్‌లో వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల మున్సిపల్ కౌన్సిలర్లతో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. - వికారాబాద్ జూన్ 19

## పారిశుధ్య పనులు చేపట్టాలి



పనులను పర్యవేక్షిస్తున్న మున్సిపల్ చైర్మన్ అశోక్

పరిగి, జూన్ 19 : అన్ని కాలనీల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని పరిగి మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్ పేర్కొన్నారు. బుధవారం ఉదయం ఆయన పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతూ.. ప్రతి కాలనీలోని మురికి కాలువల్లో పేరుకుపోయిన సిల్ట్‌ను ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. సిల్ట్‌ను ట్రాక్టర్ల ద్వారా డంపింగ్‌యార్డుకు తరలించాలన్నారు. ప్రధాన రహదారులను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని, రహదారులపై చెత్తాచెదారం లేకుండా చూడాలన్నారు. చెత్తను కూడా ట్రాక్టర్ల ద్వారా తరలించాలని ఆయన పేర్కొన్నారు. అనంతరం పలు చోట్ల పారిశుధ్య పనులను మున్సిపల్ కమిషనర్ వెంకటయ్యతో కలిసి చైర్మన్ పర్యవేక్షించారు.

## ఆలయ భూముల కౌలుకు బహిరంగ వేలం

దోమ, జూన్ 19 : దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయ భూముల కౌలుకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు దేవాదాయ ధర్మాదాయ శాఖ కార్యనిర్వాహణ అధికారి సుధాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దొంగ ఎన్కేపల్లిలో సంజీవస్వామి ఆలయానికి సంబంధించిన భూములు గూడూర్ గ్రామంలో ఉన్నాయి. ఆ భూములను రైతులు కౌలుకు చేసుకొనుటకు శుక్రవారం ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. సర్వే నం.66లో 14 ఎకరాలు, 135లో 10ఎకరాల 32 గుంటలు, 173లో 20 ఎకరాల 17 గుంటలు, 174లో 38 గుంటల భూములున్నాయన్నారు. ఉత్సాహవంతులైన రైతులు రూ.10వేలు డిపాజిట్ చేసి వేలంలో పాల్గొని భూములను దక్కించుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.

## మున్సిపల్ కార్యాలయంలో ప్రజాపాలన సేవా కేంద్రం కౌంటర్

వికారాబాద్, జూన్ 19 : 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్ బిల్లు (జీరో బిల్లు) పథకానికి సంబంధించి ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల వికారాబాద్ మున్సిపల్ కార్యాలయంలో ప్రజాపాలన సేవా కేంద్రం కౌంటర్‌ను ప్రారంభించారు. ఉచిత కరెంట్ బిల్లులు ఎందుకు రావడం లేదు, అందులో ఏమైనా మిస్టేక్స్ ఉన్నాయా..? అనే పూర్తి వివరాలు కౌంటర్లో దరఖాస్తు చేసుకుంటే పరిష్కారం చూపడం జరుగుతుందని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయంలో ప్రజాపాలన కౌంటర్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల



ప్రజా పాలన సహాయ కేంద్రంలో వివరాలను నమోదు చేస్తున్న సిబ్బంది

## జీరో కరెంట్ బిల్ కోసం..

పెద్దేముల్, జూన్ 19 : మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన సహాయ కేంద్రంలో జీరో కరెంట్ బిల్లుల కోసం ప్రజల నుంచి వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో అప్డేట్ చేసే ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతున్నదని ఎంపీడీవో జర్నప్ప అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రతి రోజూ సుమారు 100 మంది వివరాలను నమోదు చేస్తున్నామని, ఇంకా ఎవరైనా తమ వివరాలను సహాయ కేంద్రంలో ఇవ్వకపోతే.. కంప్యూటర్ ఆపరేటర్ శ్రీనివాస్‌గౌడ్‌కు అందించి అప్‌డేట్ చేయించుకోవాలన్నారు.

### బైకును ఢీకొన్న లారీ

# తల్లీకూతురు దుర్మరణం

యాలాల, జూన్ 19 : అది నిత్యం రద్దీగా ఉండే రోడ్డు. ప్రతి రోజూ వేల వాహనాలు ప్రయాణిస్తుంటాయి. ఆ రోడ్డుపై జరిగిన ప్రమాదంలో తల్లీకూతుర్లు మృతిచెందిన సంఘటన బుధవారం సాయంత్రం తాండూరు కాగ్నా నది శివారులో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. బంట్వారం మండలం సల్బత్తానూర్ గ్రామానికి చెందిన కోస్గి నర్సింహులు తన భార్య అనిత(25), కూతురు చిట్టి(1), కుమారుడితో కలిసి యాలాలలోని ఆధార్ సెంటర్‌కు వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో కాగ్నా నది బ్రిడ్జి సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న లారీ బైకును ఢీకొంది. వెనక బైక్‌పై ఉన్న భార్య, కూతురు కింద పడిపోయారు. లారీ చక్రాలు వారిపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. నర్సింహులు, అతని కుమారుడికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదానికి కారణమైన లారీ అంతకుముందే బాలరాజు, లక్ష్మీ దంపతులు ప్రయాణిస్తున్న బైకును ఢీకొంది. ఈ ప్రమాదంలో వారికి స్వల్ప గాయాలయ్యాయి. సంఘటనా స్థలానికి చేరుకున్న యాలాల పోలీసులు మృతదేహాలను తాండూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపారు.

**బాధిత కుటుంబాలకు పరామర్శ**

తాండూరు పట్టణ సమీపంలో వేర్వేరు ప్రమాదాల్లో గాయపడిన బాధితులను ఆర్‌బీఓఎల్ సీఈవో బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి పరామర్శించి వారిలో మనోధైర్యాన్ని నింపారు. తాండూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం జరిగిన లారీ బైకును ఢీకొట్టిన ప్రమాదంలో మృతిచెందిన అనిత, చిట్టి బాధిత కుటుంబాన్ని పరామర్శించి కోస్గి నర్సింలుకు అండగా ఉంటానని భరోసానందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పాఠశాలల సమయంలో భారీ వాహనాలను పట్టణంలోకి అనుమతించరాదని పోలీసులకు సూచించారు. తల్లిదండ్రులు, విద్యార్థులు రోడ్డు దాటే సమయంలో, రోడ్లపై ప్రయాణించే సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. వేగం కన్నా ప్రాణం మిన్న అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. రోడ్డుపైకి వచ్చే ప్రతి ఒక్కరూ బాధ్యతగా రహదారి నిబంధనలను తెలుసుకొని ప్రమాదాలు జరగకూడదనే ధ్యేయంతో ప్రవర్తించాలన్నారు. మానవ తప్పిదాలతోనే ప్రమాదాలు జరుగుతాయన్నారు. అతివేగం, అత్యుత్సాహం, ఆత్రుత, అవివేకం కారణంగా ప్రమాదాలు చోటు చేసుకుంటాయన్నారు.



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఆర్‌బీఓఎల్ సీఈవో శ్రీనివాస్‌రెడ్డి



నిందితులను మీడియా ఎదుట ప్రవేశపెట్టి వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ బాలకృష్ణారెడ్డి

# బైక్ దొంగలు అరెస్ట్, రిమాండ్

యాలాల, జూన్ 19 : నలుగురు బైక్ దొంగలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన బుధవారం తాండూరులో జరిగింది. పట్టణ కేంద్రంలోని డీఎస్పీ కార్యాలయ ఆవరణలో నిందితులను డీఎస్పీ బాలకృష్ణారెడ్డి మీడియా ఎదుట ప్రవేశపెట్టి వివరాలు వెల్లడించారు. జూన్ 17న తాండూరులోని మినార్ టీ పాయింట్ వద్ద పార్క్ చేసిన తన బైక్ దొంగిలించబడిందని బోయిని సత్యనారాయణ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అందులో భాగంగా బుధవారం ఉదయం 9 గంటల ప్రాంతంలో వాహనాలను తనిఖీ చేస్తున్న క్రమంలో తాండూరు పట్టణం గ్రీన్ సిటీ కాలనీకి చెందిన అడిగోల్ల వంశీకృష్ణగౌడ్, అంతారం గ్రామానికి చెందిన బొడ్డె జస్వంత్ వెళ్తున్న బైక్‌కు సంబంధించి వివరాలను పోలీసులు ఆరా తీశారు. బైక్‌ను దొంగిలించామని ఒప్పుకోవడంతో మరో ఇద్దరు మైనర్ బాలురతో కలిసి మొత్తం ఆరు బైకులను దొంగతనం చేసినట్లు ఒప్పుకొన్నారు. తాము దొంగిలించిన బైకులను కొద్ది రోజుల తర్వాత అమ్మివేద్దామని తమ ఇండ్ల వద్ద ఉంచామన్నారు. బైకులను పోలీసులు స్వాధీనం చేసుకొని నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించిన పోలీసులను ఈ సందర్భంగా అభినందించారు.

## సమస్యలు పరిష్కరించాలి

ధారూరు, జూన్ 19 : మండల పరిధిలోని గ్రామపంచాయతీల్లో పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వర్కర్స్ యూనియన్ సభ్యులు కోరారు. బుధవారం గ్రామ పంచాయతీల కార్మికులు పెండింగ్ వేతనాలు, వారి సమస్యలు పరిష్కరించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ధారూరు ఎంపీవో షఫీఉల్లాకు వినతిపత్రం అందజేశారు. కార్మికులకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, కనీస వేతనం రూ.26వేలు, ప్రమాద బీమా రూ.10లక్షలు ఇవ్వాలని వారు కోరారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ నాయకులు రవికుమార్, అశోక్, మల్లేశం, అనంతయ్య, గోపాల్, రాములు, అంజయ్య, శ్రీశైలం, పెంటయ్య, లక్ష్మణ్, మోతీలాల్, వెంకటయ్య, మహిపాల్ ఉన్నారు.



ధారూరు ఎంపీవో షఫీఉల్లాకు వినతిపత్రం ఇస్తున్న గ్రామపంచాయతీ కార్మికులు

## వర్షాలు కురవాలని..

కులకచర్ల, జూన్ 19 : వర్షాకాలం ప్రారంభమైనా ఇప్పటికీ సరైన వర్షాలు కురవకపోవడంతో చౌడాపూర్ గ్రామస్తులు బుధవారం గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రోకలిబండకు కొత్తగుడ్డతో కప్పను కట్టి పసుపు కుంకుమతో అలంకరించారు. కప్పను రోకలికి వేలాడదీసి భుజాన వేసుకొని ఇంటింటికి తిరుగుతూ స్నానం చేయించారు. వర్షాలు సక్రమంగా కురిసేలా చూడు తండ్రి అని వాన దేవుడిని వేడుకున్నారు.



వర్షాలు కురవాలని చౌడాపూర్‌లో గ్రామ దేవతలకు పూజలు నిర్వహిస్తున్న మహిళలు



చౌడాపూర్ మండలం మక్తవెంకటాపూర్‌లో కాళికాదేవి ఉత్సవాల్లో పాల్గొన్న గ్రామస్తులు, అధికారులు - కులకచర్ల, జూన్ 19


**తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ**
**వికారాబాద్ జిల్లా**

**టెండరు ప్రకటన**

**Rc.No. Vikarabad/DIET/05/2024** **Date: 20/06/2024**

2024-25 విద్యాసంవత్సరమునకు గాను వికారాబాద్ జిల్లా పరిధిలో గల 09 సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలు (బాలికలు-05 వికారాబాద్, కోకట్, బంట్వారం, మోమిన్‌పేట్, డిగ్రీ కళాశాల మరియు బాలురు-04 శివారెడ్డిపేట్, పరిగి, కొడంగల్, పెద్దేముల్) నందు ఆహార పదార్థాలు (కిరాణం, కూరగాయలు, పండ్లు, కోడిగుడ్లు, చికెన్, మటన్ మరియు క్యాటరింగ్ సర్వీస్) ల్యాబ్ మెటీరియల్ మాత్రం బంట్వారం, డిగ్రీ కాలేజ్‌లకు తప్ప మిగతా 7 కాలేజీలకు వర్తిస్తాయి. (వికారాబాద్, కోకట్, పరిగి, శివారెడ్డిపేట్, డిగ్రీ కాలేజ్, మోమిన్‌పేట్, పెద్దేముల్) స్టూడెంట్ మరియు ఆఫీసు స్టేషనరీ సామాగ్రి కొనుగోలు నిమిత్తం అధీకృత డీలర్లు మరియు వ్యక్తుల నుండి సీల్డ్ టెండర్లు కోరబడుతున్నవి.

కావున ఆసక్తి కలవారు రూ.లు 1500/- (పదిహేను వందల రూపాయలు మాత్రమే) DD రూపంలో ప్రిన్సిపాల్, TGSWRS/JC(G), కొత్తగడి, వికారాబాద్ గారి పేరున SBI బ్రాంచి ద్వారా మాత్రమే చెల్లించి టెండర్ దరఖాస్తు ఫారమును పొందగలరు. టెండరు ఫారమును అమ్మబడు తేది: 20/06/24 నుండి 26/06/24 వరకు ప్రిన్సిపాల్, TGSWR, COE(G), వికారాబాద్ నందు కార్యాలయం పనిచేయు దినములలో ఉదయం 10.30 గం. నుండి సాయంత్రం 5.00 గంటల వరకు పొందగలరు. అలాగే సంబంధిత ప్రిన్సిపాల్ పేరున EMD లు తీసుకొని SBI లో చెల్లుబాటు అగునట్లు తీసుకొని రావాలి. సీల్డ్ టెండరును తేది: 27/06/24 సాయంత్రం 5 గంటలలోపు బాక్స్‌లో వేయవలసి ఉంటుంది. గడువు తర్వాత టెండర్ ఫారము ఇవ్వటం గానీ, తీసుకోవటం గానీ జరుగదు. షెడ్యూల్ కులముల మరియు షెడ్యూల్ తెగల వారికి ధరావతులో 40 శాతం మినహాయింపు ఇవ్వబడును.

The details of EMD for the academic year 2024-25 is as follows:

| Sl.No. | Name of the Item | EMD Rs. Others Rs. | EMD Rs. For SC/ST Category Rs. |
|---|---|---|---|
| 1 | Food Provisions | 1,50,000 | 90000 |
| 2 | Fruits / Vegetables | 1,00,000 | 60000 |
| 3 | Eggs | 60000 | 36000 |
| 4 | Chicken/ Mutton | 80000 | 48000 |
| 5 | Catering Contract | 150000 | 90000 |
| 6 | Stationery | 100000 | 60000 |
| 7 | Lab Material | 50000 | 30000 |

సీల్డ్ టెండర్ అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ), వికారాబాద్ గారి కార్యాలయములో తేది: 28/06/24 నాడు జిల్లా కొనుగోలు కమిటీ సమక్షంలో తెరువబడును. పైన పేర్కొన్న తేదీలు టెండర్ల విధి విధానాలు, షరతులు అన్ని విషయాలలో మార్పులు చేయుటకు, రద్దు చేయుటకు, వాయిదా వేయుటకు అడిషనల్ కలెక్టర్/ చైర్మన్ DPC వికారాబాద్ గారికి పూర్తి అధికారం కలదు. ఇతర వివరములకు జిల్లా సమన్వయ అధికారి TGSWR, COE(G) వికారాబాద్ జిల్లా వారిని సంప్రదించగలరు.

**జిల్లా సమన్వయాధికారి**
**TGSWR, COE(G)**
**వికారాబాద్ జిల్లా**

**అడిషనల్ కలెక్టర్/ చైర్మన్**
**డిపిసి, జిల్లా కొనుగోలు కమిటీ**
**TGSWREI Society**
**వికారాబాద్ జిల్లా**